సంపుటి :02 సంచిక :198 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

మంగళవారం 30, సెప్టెంబర్ 2025



## కోర్టులో నిలువదని తెలిసి ఎన్నికల షెడ్యూల్ ఎందుకిచ్చారు?

బీహార్, మహారాష్ట్రలో ఎదురైన అనుభవమే ఎదురవుతుంది..

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

04

## రెండేసి విడతల్లో ఎన్నికలు

- జిల్లా కలెక్టర్ సత్యశారద
- రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం
- ఎన్నికల ప్రవర్తన నియమావళి, షెడ్యూల్ పై వివరణ

02






# గెలుపు గుర్రాల వేట

## ప్రాదేశిక పోరుకు సై

- మొదటిదశ ఎన్నికలకు 9న నోటిఫికేషన్
- 11వరకు నామినేషన్ల స్వీకరణ.. 12న స్క్రూట్నీ
- 15న ఉప సంహరణ గడువు.. 23 పోలింగ్
- ఎమ్మెల్యేలు, పార్టీ పెద్దల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు
- ఎంపీటీసీ, జడ్పీటీసీ సీట్లకోసం పైరవీలు
- పల్లెల్లో రాజుకున్న రాజకీయ వేడి

రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు గెలుపు గుర్రాల వేటలో పడ్డాయి. అధికార పార్టీ కాంగ్రెస్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నది. బీఆర్ఎస్, బీజేపీ సైతం చాలెంజ్‌గా తీసుకుంటున్నాయి. వామపక్షాలు, ఇతర పార్టీలు సైతం సత్తా చాటేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. ముందుగా ప్రాదేశిక ఎన్నికలు జరుగనుండటంతో ఆ ఎన్నికలను టార్గెట్ చేశాయి. ఉమ్మ డి వరంగల్ జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలతో పాటు ఆరు జిల్లా పరిషత్‌లను గెలుచుకునేందుకు పావులు కదుపుతున్నాయి. అధికార పార్టీ నుంచి మంత్రులు, ఎమ్మె ల్యేలపై అధిష్ఠానం ఈ బాధ్యతలు మోపనుండగా బీఆర్ఎస్, బీజేపీ సైతం త్వరలోనే ఇన్‌చార్జ్‌లను నియమించనున్నాయి. ఉమ్మ డి వరంగల్ జిల్లాలో ఆరు జిల్లాల పరిధిలోని ఆరు జిల్లా పరిషత్తులు, 75 జడ్పీటీసీలు, 75 ఎంపీపీలు, 778 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. **– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి**

02

## పారదర్శకంగా ఎలక్షన్స్

రాజకీయ పార్టీలు సహకరించాలి


జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

02



## సల్లంగా చూడు బతుకమ్మ...

తొమ్మిది రోజుల పాటు తెలుగునాట సందడి చేసిన బతుకమ్మ పండుగ సద్దుల బతుకమ్మ వేడుకతో ఘనంగా ముగిసింది. అంబరాన్ని అంటిన ఈ ఉత్సవాల్లో రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, చిన్నారులు ఉల్లాసంగా పాల్గొన్నారు. తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలను వీధుల్లో ఊరేగిస్తూ, కోలాట నృత్యాలతో, ఆటపాటలతో సందడి చేశారు. ఆనందోత్సాహాల మధ్య చెరువుల్లో నిమజ్జనం చేసి, వాయినాలు పంచుకున్నారు. శాయంపేట, నల్లబెల్లి సహా వివిధ మండలాల్లో జరిగిన ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.



## కుటుంబ సభ్యులతో గడపాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

03




# పారదర్శకంగా ఎన్నికలు

- రాజకీయ పార్టీలు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

అక్షరదర్బార్, భూపాలపల్లి: ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం ఐడిఓసీ కార్యాలయపు కాన్ఫరెన్స్ హాలులో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా రాజకీయ పార్టీలు ఎన్నికల్లో పాటించాల్సిన నియమ, నిబంధనల గురించి జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సోమవారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎలాంటి రాజకీయ పార్టీల సమావేశాలు, సభలు నిర్వహించరాదని సూచించారు. జిల్లాలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్ లను తొలగించాలని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిపై ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే నేరుగా కానీ సి-విజిల్ యాప్ ద్వారా లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చుని,1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కూడా 24 గంటల్లో పిర్యాదు చేయవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కోడ్ అమలులో ఉన్నందున రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి అనుమతి లేదని వివరించారు. రాజకీయ పార్టీలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో సమావేశాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించొద్దని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీపీఓ శ్రీలత వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







## గెలుపు గుర్రాల వేట..!

- ప్రాదేశిక పోరుకు సై
- మొదటిదశ ఎన్నికలకు 9న నోటిఫికేషన్
- 11వరకు నామినేషన్ల స్వీకరణ.. 12న స్క్రూట్నీ
- 15న ఉప సంహరణ గడువు.. 23 పోలింగ్
- ఎమ్మెల్యేలు, పార్టీ పెద్దల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ సీట్ల కోసం పైరవీలు
- పల్లెల్లో రాజుకున్న రాజకీయ వేడి

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి**

రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు గెలుపు గుర్రాల వేటలో పడ్డాయి. అధికార పార్టీ కాంగ్రెస్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నది. బీఆర్ఎస్, బీజేపీ సైతం చాలెంజ్‌గా తీసుకుంటున్నాయి. వామపక్షాలు, ఇతర పార్టీలు సైతం సత్తా చాటేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. ముందుగా ప్రాదేశిక ఎన్నికలు జరుగనుండటంతో ఆ ఎన్నికలను టార్గెట్ చేశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలతో పాటు ఆరు జిల్లా పరిషత్‌లను గెలుచుకునేందుకు పావులు కదుపుతున్నాయి. అధికార పార్టీ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలపై అధిష్ఠానం ఈ బాధ్యతలు మోపనుండగా బీఆర్ఎస్, బీజేపీ సైతం త్వరలోనే ఇన్‌చార్జ్‌లను నియమించనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు జిల్లాల పరిధిలోని ఆరు జిల్లా పరిషత్తులు, 75 జడ్పీటీసీలు, 75 ఎంపీపీలు, 778 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి.

### - 45 రోజులపాటు ఎన్నికల కోడ్

**ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో నిఘా పెరగనున్నది. మండలాలు, జిల్లాల సరిహద్దుల్లో 25 చెక్‌పోస్టుల ఏర్పాటుకు పోలీస్ అధికారులు స్థలాలను పరిశీలిస్తున్నారు. సుమారు 45 రోజులు ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుండగా, అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాలకు కోడ్ కారణంగా బ్రేక్ పడనుంది.**

### - జడ్పీ చైర్మన్ల రిజర్వేషన్లు ఇలా..

హనుమకొండ జిల్లా జడ్పీ చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. వరంగల్ జిల్లా ఎస్టీ జనరల్, మహబూబాబాద్ జిల్లా అన్ రిజర్వ్ డ్ (జనరల్), జనగామ జిల్లా ఎస్సీ మహిళ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీసీ జనరల్, ములుగు జిల్లా ఎస్టీ మహిళకు రిజర్వ్ అయింది. జనరల్ స్థానాల్లో ఎవరిని బరిలో నిలబెట్టాలనే ఆలోచనలో పార్టీలున్నాయి. ఎక్కువ డబ్బు, పరపతి ఉన్నసామాజిక వర్గాలకు చెందిన నేతలు ఆయా స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఎస్టీ, ఎస్సీ రిజర్వ్ అయినచోట జడ్పీ స్థానాల్లో గెలుపు గుర్రాలు ఎవరు.. అనే వేటలో ప్రధాన పార్టీలు ఉన్నాయి.

### - వేడెక్కిన రాజకీయం..

**ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పల్లెల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. గట్టిపోటీదారులను నిలబెట్టేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. అధికార పార్టీ నుంచి బరిలో దిగే అభ్యర్థుల మధ్య పోటీ ఎక్కువగా ఉన్నట్లుగానే ప్రతి పక్షం నుంచి కూడా అంతే పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజాబలం ఉన్న అభ్యర్థిని బరిలోకి దింపాలని ఆయా పార్టీల నేతలు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. కాగా తమకే టికెట్ కేటాయించాలంటూ ఆయా పార్టీల పెద్దల వద్దకు కొందరు ఆశావహులు వరుస కడుతున్నట్లు తెలిసింది. పరిషత్ ఎన్నికలు పార్టీ గుర్తులపై నిర్వహిస్తారు కాబట్టి తమకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.**

### - చకచకా ఏర్పాట్లు..

అక్టోబరు 9వ తేదీ నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ చేపట్టనుండటంతో ఈ దిశగా అధికారులకు ఏర్పాట్ల బాధ్యతలు అప్పగిస్తున్నారు. పర్యవేక్షణ కోసం పలు కమిటీలను కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు అప్పగించనున్నారు. ఇప్పటికే రిజర్వేషన్ల ప్రక్రియ ఖరారవడంతో నామపత్రాల స్వీకరణ కేంద్రాలు, బ్యాలెట్ పత్రాలు, సిబ్బందికి శిక్షణల దిశగా వేగాన్ని పెంచనున్నారు.

### - ఎన్నికల షెడ్యూల్

మొదటి దశ ప్రాదేశిక ఎన్నికలకు ఈ నెల 9న నోటిఫికేషన్ విడుదల కానున్నది. యంత్రాంగం 11 వరకు నామినేషన్లను స్వీకరిస్తుంది. 12వ తేదీన స్క్రూట్నీ ఉంటుంది. 15న ఉపసంహరణ గడువు. 23వ తేదీన పోలింగ్ జరుగనున్నది. నవంబర్ 11న ఫలితాలు వెలువడనున్నాయి. రెండో దశ ప్రాదేశిక ఎన్నికలకు ఈ నెల 13న నోటిఫికేషన్ విడుదల కానున్నది. యంత్రాంగం 15 వరకు నామినేషన్లను స్వీకరిస్తుంది. 16వ తేదీన స్క్రూట్నీ ఉంటుంది. 19న ఉపసంహరణ గడువు. 27వ తేదీన పోలింగ్ జరుగగా, నవంబర్ 11న ఫలితాలు వెలువడనున్నాయి.



# రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు

- జిల్లా కలెక్టర్ సత్యశారద
- రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం
- ఎన్నికల కోడ్, షెడ్యూల్ పై వివరణ

**అక్షరదర్బార్, వరంగల్:**

స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు, రెండు విడతల్లో గ్రామ పంచాయతీలకు( సర్పంచ్, వార్డు సభ్యులు)ఎన్నికలు నిర్వహించనున్నామని తెలిపారు. అక్టోబర్ 23న మొదటి విడతలో వరంగల్ రెవిన్యూ డివిజన్ పరిధిలోని గీసుగొండ, సంగెం, రాయపర్తి, పర్వతగిరి, వర్ధన్నపేట మండలాల్లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. అక్టోబర్ 27న రెండవ విడతలో నర్సంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని చెన్నారావుపేట, దుగ్గొండి, నల్లబెల్లి, నెక్కొండ, నర్సంపేట, ఖనాపూర్ మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతాయని అన్నారు.

సర్పంచ్ లు, వార్డు సభ్యులకు జిల్లాలో రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడతలో 5 మండలాల్లో 157 సర్పంచ్, 1350 వార్డు మెంబర్లకు, రెండవ విడతలో 6 మండలాల్లో 160 సర్పంచ్, 1404 వార్డు సభ్యులకు, ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొత్తంగా జిల్లాలోని 317 గ్రామ పంచాయతీల్లో 2 వేల 754 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

సర్పంచ్ వార్డు, సభ్యుల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ నిర్వహించిన రోజు ఫలితాలు వెలుపడతాయని అన్నారు. జడ్పిటిసి, ఎంపిటిసి ఓట్ల లెక్కింపు నవంబర్ 11న ఉంటుందని అన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ప్రతి మూడు, నాలుగు మండలాలకు ఒక ఆర్ఓ ను నియమిస్తున్నామని, మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని అన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా కేంద్రంలోని ఏనుమాముల మార్కెట్ యార్డులో స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో డీఆర్ ఓ విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి కల్పన, నోడల్ అధికారులు, బీజేపీ ప్రతినిధులు బాకం హరిశంకర్, ధాన్యనాయక్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి టి రవీందర్ రావు, బీఆర్ఎస్ ప్రతినిధి అశోక్ కుమార్, టీడీపీ నుంచి శ్యామ్, బీఎస్పీ నుంచి నాగరాజు, వైఎస్సార్ సీపీ నుంచి రజనీకాంత్, డీఎస్పీ నుంచి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కోరోకేర్ సెంటర్ ప్రారంభం

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలో సోమవారం కోరమాండల్ వారి కోరోకేర్ సెంటర్ ప్రారంభం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఏరియా మేనేజర్ శివ కోటిరెడ్డి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రైతులకు పురుగు మందులు అందుబాటులో ఉండే విధంగా కోరకేర్ సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. రైతులకు కావలసిన ప్రతి ఒక్కటి కోరకేర్ సెంటర్ లోనే అందుబాటులో ఉంటుందని పరకాల ప్రాంత రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల స్టోర్ మేనేజర్ మైన రాజేష్ తదితరులు పాల్గొన్నారు



# స్థానిక పోరులో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

## కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర


అక్షర దర్బార్ శాయంపేట : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బాకీ పడ్డ కాంగ్రెస్ బాకీ కార్డును మాజీ ఎమ్మెల్యే గండ్ర విడుదల చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలల్లో అన్ని వర్గాల ప్రజలకు ఎంత బాకీ పడ్డదో కాంగ్రెస్ బాకీ కార్డు ద్వారా ప్రజలకు తెలియజేసి ఓటు కోసం మీ ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీసి అడిగేలా వారిని చైతన్యవంతులను చేయాలని కోరారు. కార్యక్రమంలో శాయంపేట మండల మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, వంగాల నారాయణ రెడ్డి , బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ ధూదిపాల తిరుపతి రెడ్డి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.





- ఆశావహులకు షాక్..
- ద్వితీయ శ్రేణికి ఊరట
- పరకాల నియోజకవర్గంలో వేడెక్కిన రాజకీయం

# రిజర్వేషన్ల కలకలం




**అక్షరదర్బార్, పరకాల:**

రిజర్వేషన్ల ఖరారు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల కావడంతో పరకాల నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బతుకమ్మ, దసరా పండుగల సందడిలో ఆ పార్టీ–ఈ పార్టీ తేడా లేకుండా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల రణరంగానికి సన్నద్ధమవుతున్నారు. అయితే రిజర్వేషన్ల వల్ల పలువురు ఆశావహులు తీవ్ర అసంతృప్తికి లోనవగా, ద్వితీయ శ్రేణి నాయకుల్లో మాత్రం ఆనందం వెల్లివిరుస్తోంది.

### - ద్వితీయ శ్రేణి నాయకుల సందడి

ఇప్పటివరకు బ్యానర్లు ఏర్పాటు చేసి, జెండాలు మోసే పనిలోనే ఉన్న ఆయా ప్రధాన రాజకీయ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులకు రిజర్వేషన్లు కలిసి వచ్చినట్లు కనపడుతోంది. తమకు పోటీ చేసే అవకాశం వచ్చిందనే ఉత్సాహంతో వారు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఎన్నికల్లో గెలుపు తమదేననే ధీమాతో ముందుకు వెళ్తున్నారు.

### - సీనియర్ల కొత్త వ్యూహం

రిజర్వేషన్ల వల్ల తమకు పోటీ చేసే అవకాశం లేకపోవడంతో సీనియర్ నాయకులు ఇప్పుడు తమ అనుకూల అభ్యర్థులకు టికెట్ వచ్చేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, పార్టీ హైకమాండ్ వద్ద తమ ప్రతిపాదన వినిపించే పనిలో ఉన్నట్లు సమాచారం.

### - యువతకు సువర్ణావకాశం

ఇప్పటివరకు రాజకీయాలకు దూరంగా ఉన్న యువతకు రిజర్వేషన్లు ఓ గొప్ప అవకాశంగా మారాయి. సామాజిక సేవను ఆశయంగా పెట్టుకున్న యువత రాజకీయాలలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా, కుల,మతాలకు అతీతంగా ముందుకు వస్తున్నారు. చాలామంది యువతకు ఇప్పటికే పలు పార్టీల నుండి పిలుపు వస్తుండటం విశేషం.

### - రిజర్వేషన్లు మారేనా?

ప్రస్తుత రిజర్వేషన్లు ఫిక్సేనా? లేక రాజకీయ ఒత్తిళ్లతో మరోసారి మారే అవకాశముందా? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. రాజకీయ ప్రోద్బలంతో గణనీయ మార్పులు చోటుచేసుకున్న సందర్భాలు గతంలో లేకపోలేదు. అందువల్లే అసలు పోటీదారులపై స్పష్టత రావాలంటే ఇంకా కొన్ని రోజులు వేచిచూడాల్సిందేనని విశ్లేషకులు అంటున్నారు. పరకాల నియోజకవర్గంలో రిజర్వేషన్ల ప్రభావంతోనే ఈ సారి ఎన్నికల సమీకరణాలు బాగా మారనున్నాయి. రాజకీయ నాయకత్వం కూడా కొత్త సమీకరణాలతో ముందుకు సాగుతుండటంతో స్థానిక రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. ఏదేమైనా, రిజర్వేషన్లతో షాక్ తిన్నవారికన్నా, కొత్త అవకాశాలు దక్కిన వారే ఇప్పుడు ప్రధానంగా ప్రజల్లో చర్చకు కేంద్ర బిందువయ్యారు.

### - బీసీ రిజర్వేషన్లతో నిరాశ

**ఈ సారి ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుతో, ఇప్పటికే ప్రజల్లో చురుకుగా తిరుగుతూ టికెట్ ఖాయం అనుకుని ప్రచారంలో నిమగ్నమైన కొందరు కీలక నాయకులకు ఊహించని పరిణామం ఎదురైంది. రాజకీయంగా బలమైన నేతలు కూడా తమకు పోటీ చేసే అవకాశం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రిజర్వేషన్ లో మార్పు కోసం ప్రయత్నాలు సాగించినప్పటికీ సక్సెస్ కాలేదు. దీంతో, తమ వర్గానికి చెందిన అభ్యర్థికి ఎన్నికల బరిలో నిలిచే అవకాశం కల్పించాలని నాయకత్వాన్ని ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.**

# కుటుంబసభ్యులతో గడపాలి: సీపీ

అక్షరదర్బార్, హనుమకొండ: నిరంతరం విధులు నిర్వహించి నేడు ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ అధికారులు ఇకపై తమ కుటుంబ సభ్యులతో గడపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సుధీర్ఘ కాలం పని చేసి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులను ఆయన మంగళవారం సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పదవీ విరమణ పొందిన వారిలో ఎస్ఐలు జే.మనోహర్ రాజు, వి చంద్రమౌళి, ఆర్ఎస్ఐ ఎండీ నయీమ్, ఏఆర్ఎస్ఐలు కుమారస్వామి, ఎస్డీ సుజావుద్దీన్, జే ప్రభాకర్ రెడ్డి, వి సారయ్య ఉన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మీ సేవలు నేటి తరం పోలీసులకు అదర్శంగా నిలుస్తాయని, నేటి ఈ ప్రశాంత వాతావరణానికి మీ సేవలే కారణమని, మీరు అందించిన సేవలు మరువమని కొనియాడారు. కార్యక్రమములో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, ఏసీపీ నాగయ్య, ఆర్ఐలు సతీష్, స్పర్జన్ రాజ్, ఆర్ఎస్ఐ శ్రవణ్ పాల్గొన్నారు.



# ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

## అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



అక్షర దర్బార్, గూడూరు: గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏపూరు గ్రామ శివారు టేకుల తండాలో సోమవారం రాత్రి ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై బి. గిరిధర్ రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. టేకుల తండాకు చెందిన లకావత్ కోట్యా (40) సోమవారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కోట్యా మృతిపై తల్లి లకావత్ చాంది ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై బి. గిరిధర్ రెడ్డి వెల్లడించారు.

# బస్సు, కారు ఢీ

## పలువురికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం శివారు బాంబుల గడ్డ సమీపంలో మంగళవారం జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొనగా పలువురికి గాయాలు అయినట్లు తెలిసింది. భూపాలపల్లి డిపోకు చెందిన "పల్లె వెలుగు" బస్సు భూపాలపల్లి నుంచి మంచిర్యాల వైపు వెళుతున్న క్రమంలో కాళేశ్వరం నుంచి భూపాలపల్లి వస్తున్న కారు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో 13 మందికి గాయాలయ్యాయి. ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. మరో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే ఆర్టీసీ డీఎం ఇందు స్థానిక పోలీసు అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





## రాజీవ్ ఆరోగ్యశ్రీ నిరుపేదలకు సంజీవిని

అక్షర దర్బార్, చిట్యాల : ఆర్థిక స్తోమత లేని నిరుపేదలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ఒక అమృతసంజీవిని లాంటిదని, కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ జిల్లా టీం లీడర్ యామంకీ అనిల్ అన్నారు. మంగళవారం చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డ్యూటీ డాక్టర్ క్రాంతితో కలిసి ఆరోగ్యశ్రీ వార్డును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన వైద్య సేవలు అందించడం కోసం రూ.5 లక్షలుగా ఉన్న సహాయాన్ని రూ.10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ఆయన వెంట ఆరోగ్య మిత్రలు గుర్రపు రాజమౌళి, స్వప్న,దేవి తదితరులు ఉన్నారు.

## ఆశీర్వదిస్తే అభివృద్ధి చేస్తా..

**- యువ సర్పంచ్ అభ్యర్థి జరుపుల గీత**



అక్షర దర్బార్ శాయంపేట : నాయకత్వం కోసం కాదు.. గ్రామానికి సేవ చేసేందుకు ముందుకు వస్తున్నానని సూర్యనాయక్ తండా గ్రామానికి చెందిన యువ సర్పంచ్ అభ్యర్థి జరుపుల గీత అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన గ్రామ పంచాయతీల రిజర్వేషన్ ప్రక్రియలో భాగంగా మండలంలోని సూర్యనాయక్ తండ సర్పంచ్ ఎస్టీ మహిళ రావడం జరిగింది.కన్నతల్లి లాంటి ఊరు కోసం ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ బరిలో నిలిచి, గెలిచిన తర్వాత సామాన్య ప్రజలకు సేవ చేసేందుకు యువ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉంటానని రాజకీయాల్లో నా వంతు పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నానని సర్పంచ్ గా అవకాశం ఇస్తే గ్రామాభివృద్ధిలో పాలుపంచుకొని కన్నతల్లి లాంటి ఊరుకి నా వంతు కృషిగా పని చేసి ఆచరణలో చూపెడతానని గ్రామానికి సేవ చేయాలనే దృక్పథంతోనే సర్పంచ్ బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఆశీర్వదిస్తే తప్పకుండా సర్పంచ్ గా పోటీ చేసి విజయం సాధించి గ్రామాభివృద్ధిలో పాలుపంచుకుంటానని అన్నారు.

## ఎలక్షన్ కోడ్ ను పకడ్బందీగా అమలు చేయాలి



అక్షర దర్బార్, పరకాల: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమీషన్ గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ లకు ఎన్నికలు నిర్వహించడానికి నిన్న నోటిఫికేషన్ షెడ్యూల్ జారీ చేసి వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేయాలని ఆదేశించిన నేపథ్యంలో పరకాల మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు సహకరించాలని పరకాల యంపీడీఓ పెద్ది ఆంజనేయులు కోరారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన 24 గంటలలోపు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి ప్రజా ప్రతినిధుల ఫొటోలు కానీ రాజకీయ రాతలు కానీ ఉండొద్దని, అలాగే 48 గంటలలోపు పబ్లిక్ స్థలాల్లో, 72 గంటలలోపు ప్రైవేటు ప్రాపర్టీలలో తొలగించాలని మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

- **బైక్ ను ఢీకొట్టిన లారీ**
- **హెడ్ కానిస్టేబుల్ కు తీవ్ర గాయాలు**



అక్షర దర్బార్, పరకాల: హన్మకొండ జిల్లా పరకాల–హన్మకొండ ప్రధాన రహదారిపై కామారెడ్డిపల్లి వద్ద కంకర లోడుతో వెళుతున్న ఓ లారీ అదుపు తప్పి ఒక గొర్ల కాపరిని ఢీ కొట్టి, తర్వాత ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌తో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. రవీందర్ పరకాల పోలీస్ స్టేషన్‌లో విధులు ముగించుకుని తన సొంత గ్రామమైన శాయంపేట మండలంలోని పత్తిపాకకు ద్విచక్ర వాహనంపై వెళ్లుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన ఇద్దరిని అత్యవసర చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీనిపై పూర్తి సమాచారం అందాల్సి ఉంది.





## కోర్టులో నిలువదని తెలిసి
# ఎన్నికల షెడ్యూల్ ఎందుకిచ్చారు?

- **బీహార్, మహారాష్ట్రలో ఎదురైన అనుభవమే ఎదురవుతుంది..**
- **మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**



అక్షరదర్బార్, కమలాపూర్: ఎవరిని మోసం చేయడం కోసం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కోర్టులో చెల్లదని తెలిసికూడా బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటించి.. గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. మంగళవారం ఆయన హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో పర్యటించారు. తన నివాసంలో బీజేపీ నేతలతో కలిసి సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీహార్, మహారాష్ట్రలో రిజర్వేషన్లపై నమోదైన పలు కేసులను సుప్రీం కోర్టు కొట్టివేసిందన్నారు. ఎవరూ కోర్టుకు వెళ్లొద్దని ముగ్గురు మంత్రులు చెబుతున్నారని, కోర్టుకు వెళ్తే అభ్యంతరం ఏంటని నిలదీశారు. ఎన్నికల్లో ఓటు కోసం డబ్బులు ఖర్చుపెట్టొద్దని రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెబుతోందని, నల్లగొండ జిల్లాలోని గిరిజన తండాల్లో బీసీలు లేకున్నా, రిజర్వేషన్ ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. తమ పార్టీ తరఫున బీసీ కోటాకు శాసన సభ, కౌన్సిల్‌లో పూర్తి మద్దతిచ్చామని, అనుభవం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని దుయ్యబట్టారు. బీజేపీపై బురద చల్లాలని చూడొద్దని కాంగ్రెస్ నేతలను హెచ్చరించారు.

## విశ్రాంత పోలీసులు కుటుంబానికి
# సమయాన్ని కేటాయించాలి

**అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్**



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: జిల్లా పోలీస్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన ఇద్దరు పోలీస్ అధికారులను, పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా జిల్లా అదనపు ఎస్పీ నరేష్ కుమార్ హాజరై రిటైర్డ్ అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు సేవలు అత్యంత కఠినమైనవి. కుటుంబ సౌకర్యాల కంటే సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేయడం మీ ప్రత్యేకత. ఎన్నో ఒత్తిడులు, సవాళ్ల మధ్య విధులను విజయవంతంగా నిర్వర్తించారు. పదవీ విరమణ అనంతరం ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఇకపై కుటుంబ సభ్యుల అభివృద్ధి కోసం సమయాన్ని కేటాయించడం ద్వారా మరింత సంతృప్తి పొందవచ్చు అని సూచించారు. పదవీ విరమణ పొందిన రేగొండ ఎస్సై రవీందర్ రెడ్డి , గోరికొత్తపల్లి ఏఎస్ఐ రాజేశం వారి కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ. రత్నం, పోలీస్ సంఘం ప్రతినిధి మర్కాల యాది రెడ్డి, రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మహా రుద్రయాగానికి సోదా సహకారం

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో నవంబర్ 3న కార్తీక మాస మహా రుద్రయాగ మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా మహా రుద్రయాగ కమిటీ సభ్యులు మంగళవారం పరకాల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సోదా రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. "మహా రుద్రయాగానికి నా వంతు సహకారాన్ని తప్పకుండా అందిస్తాను. ప్రత్యేకంగా యాగశాలలో కావాలసిన సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ రాజేశ్వరరావు, మహా రుద్రయాగ కమిటీ సభ్యులు ఎర్రం లక్ష్మణ్, పిట్ట వీరస్వామి, పంచగిరి శ్యామ్, గందె రవి, ఆలయ డైరెక్టర్ తోట రవి పాల్గొన్నారు.



## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



అక్షరదర్బార్, హనుమకొండ: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ లో గల వెంకటేశ్వర కాలనీలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మంగళవారం కమ్యూనిటీ హాల్ రూ.4.95 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానికంగా సీసీ కెమెరాల ఏర్పాటు కోసం కార్పొరేషన్ కమిషనర్, స్థానిక పోలీసులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. తమ కాలనీ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నాగరాజుకు వెంకటేశ్వరకాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హరిబాబు, వీసం సురేందర్, పిన్నింటి విజేందర్ రెడ్డి, అనిల్ రావు, కాలనీ కమిటీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బలరాం హెగ్డేవర్ బాట అందరికీ ఆమోదయోగ్యం

అక్షర దర్బార్, చిట్యాల : ఆర్ఎస్ఎస్ సృష్టికర్త డాక్టర్ బలరాం హెడేవర్ చూపిన ధర్మ మార్గమైన బాట అందరికీ ఆమోదయోగ్యమని బీజేపీ చిట్యాల మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం స్థాపించిన ఆర్ఎస్ఎస్ హిందువుల ఐక్యత, వ్యక్తి నిర్మాణమే ధ్యేయంగా పనిచేస్తూ దేశాన్ని, ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుతూ ప్రపంచంలోనే హైందవదేశం అతిపెద్ద దేశంగా విరాజిల్లుతోందని అన్నారు. అక్టోబర్ 5న చిట్యాల మండల కేంద్రంలో జరిగే పద సంచలనంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు..




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915